# తండ్రి గారి సందేశం....



## తపస్కాల ఆధ్యాత్మికత

**క్రీస్తు నాథుని యందు ప్రియ సహోదరీ సహోదరులారా!**

క్రైస్తవ ఆధ్యాత్మి జీవనంలోని అతిముఖ్యమైన ఒక కాలం తపస్కాలం. ఈ కాలంలో యేసు ప్రభుని శ్రమలను, మరణమును, పునరుత్థానమును మనం ధ్యానించుకుంటున్నాం. రక్షణకు మూలమైన ఈ సంఘటనలను మనం ఇప్పుడు స్మరించుకొనేటప్పుడు రెండు వేల సంవత్సరాల క్రితం యేసు ప్రభువు సాధించిన రక్షణలో మనం పాలుపంచుకుంటున్నాం. తపస్కాలాన్ని అర్థవంతంగా ఆచరించుకోవడానికి మనం ముఖ్యంగా మూడు కార్యాలు చేయాలి.
- ప్రార్థన, ఉపవాసం, ధర్మక్రియలు.

**1. ప్రార్థన**

ఆధ్యాత్మి జీవితానికి ఊపిరిలాంటిది ప్రార్థన. శారీరకంగా ఎదగడానికి ఆహారం ఎంత అవసరమో, ఆధ్యాత్మికంగా ఎదగడానికి ప్రార్థన కూడా అంతే అవసరం. తెస్సలోనిక ప్రజలకు రాసిన లేఖలో పౌలు గారు "సదా ప్రార్థింపుడు" అని వారికి బోధిస్తున్నారు (1 తెస్సలోని 5,17). యేసు ప్రభువు దైవ కుమారుడైనప్పటికీ తండ్రి దేవుని సదా ప్రార్థించారు. ప్రార్థన అవసరాలను తెలియపరచడం మాత్రం కాదు. ప్రార్థన ముఖ్య ఉద్దేశం దేవునితో అనుబంధమును పెంచుకోవడం. యేసు ప్రభువు తన బహిరంగ జీవితంలోని అన్ని ముఖ్యమైన సందర్భాల్లోను ప్రార్థించారు. బప్తిస్మం పొందినప్పుడు యేసు ప్రభువు ప్రార్థించారు (లూకా 3,21). శిష్యులను ఎన్నుకొనక ముందు యేసు ప్రభువు ప్రార్థించారు (లూకా 6,12). దివ్యరూపధారణ సమయంలో యేసు ప్రభువు ప్రార్థించారు (లూకా 9:28-29). లాజరును సమాధి నుండి లేపకముందు యేసు ప్రభువు ప్రార్థించారు (యోహాను 11,42). గెత్సేమనిలో యేసు ప్రభువు ఆవేదనతో ప్రార్థించారు (మత్తయి 26,42). సిలువ మీద కూడా యేసు ప్రభువు ప్రార్థించారు (లూకా 23,34). యేసు ప్రభువు వలె మనం కూడా ఎల్లప్పుడూ దేవునితో అనుబంధంలో ఎదగాలి, అన్ని వేళల్లో ప్రార్థించాలి.

**2. ఉపవాసం**

క్రైస్తవ ఆధ్యాత్మికలోని మరో ముఖ్యమైన అంశం ఉపవాసం. యేసు ప్రభువు కూడా స్వయంగా ఉపవాసమున్నారు (మత్తయి 4,1-2). ఉపవాసానికి సంబంధించిన రెండు ముఖ్య విషయాలను మనం గుర్తించాలి. మొదటిగా, ఉపవాసపు లక్ష్యం మన శ్రమ ద్వారా రక్షణను పొందడం కాదు. రక్షణ దేవుడు అనుగ్రహించే వరమే. పునీత పౌలు గారు అంటున్నారు. "విశ్వాసం ద్వారా, దేవుని వరము వలననే, మీరు రక్షింపబడితిరి. అది మీ స్వయం కృతం కాదు. దేవుని వరమే (ఎఫెసీ 2,8). ఉపవాసం యేసు శ్రమలను రక్షింపబడడం కోసము కాదు. రెండవదిగా కేవలం

భోజనం చేయకపోవడం ఉపవాసం కాదు, ఆకలి గొన్న వారికి అన్నం పెట్టడం కూడా ఉపవాసములో భాగమే. యెషయా ప్రవక్త అంటున్నారు. "నేను ఇష్టపడు ఉపవాసమిది: మీరు అన్యాయపు బంధములను విప్పుడు. ఇతరుల మెడమీది కెత్తిన కాడిని తొలగింపుడు, పీడితులను విడిపింపుడు. వారిని ఎట్టి బాధలకును గురిచేయకుడు. మీ భోజనమును ఆకలిగొనిన వారికి వడ్డింపుడు. ఇల్లువాకిలి లేని వారికి ఆశ్రయమిందు, బట్టలులేనివారికి దుస్తులిందు. మీ బంధువులకు సహాయము నిరాకరింపకుడు" (యెషయా 58,6-7). ఉపవాసం ఉండేవారు వారు హృదయ పరివర్తన చెందాలి. కావున భోజన విషయంలో మాత్రం కాకుండా మనిషి ప్రవర్తనల్లో కూడా ఉపవాసం వలన మార్పు రావాలి.

**3. ధర్మక్రియలు**

విశ్వాసం హృదయంలో ఉంటే చాలదు. క్రియల్లో కనబడాలి. పునీత యాకోబు గారు అంటున్నారు. "ఆత్మలేని శరీరము నిర్జీవమైనట్లే, చేతలు లేని విశ్వాసమును మృత ప్రాయమే (యాకోబు 2,26). పరలోక రాజ్యంలో ప్రవేశించేందుకు ధర్మక్రియలు చాలా అవసరమని యేసు ప్రభువు చెప్పారు (మత్తయి 25,31-45). పేదలకు, వితంతువులకు, అనాథలకు మనం ప్రత్యేకంగా సహాయం చేయాలి. "పేదలనాదుకొన్నచో ప్రభువుకే అప్పిచ్చినట్లు, ఆ అప్పును ఆయన తప్పక తీర్చును (సామెతలు 19,17). "పేదలనాదుకొనువాడు ధన్యుడు. అతనికి ఆపద వాటిల్లినప్పుడు, ప్రభువు వానిని ఆదుకొనును" (కీర్తన 41,1). పేదలకు సహాయం చేసేటప్పుడు మనం దేవునికే చేస్తున్నాం. దేవుడు సకాలంలో మనకు కూడా సహాయం చేస్తారు. కావున విశ్వాసాన్ని ధర్మక్రియల ద్వారా మనం నిరూపించుకోవాలి.

ఈ తపస్కాలంలో ఈ మూడు విషయాలను దృష్టిలో పెట్టుకొని మన జీవితాలను నూత్నీకరించే ప్రయత్నం మనం చేద్దాం.

**జీవము గలిగిన సజీవ దేవుని జీవస్వరం**
**మనలనందరిని జీవింపజేయును గాక. ఆమెన్.**

క్రీస్తు నందు మీ తండ్రి

**బిషప్ ప్రిన్స్ అంతోని**

ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు

"ప్రభువును నమ్మినవారు
నూత్న బలమును
పొందుదురు.
వారు పక్షిరాజువలె రెక్కలు
చాచి పైకెగురుదురు.
అలసట లేక పరుగెత్తుదురు.
బడలిక లేక
నడకసాగింతురు"
(యెషయా 40,31)